# మొగవాడి బాధ్యతలు వేరుగా ఉంటాయా?

పొట్ట చేత్తో పట్టుకుని పడీ పడీ నవ్వింది మానస! దాని నవ్వు, అంటే అది నవ్వే విధానం చూసి తనూ నవ్వునాపుకోలేక పోతోంది యోగిత! అలా ఒక అయిదు నిముషాలు జరిగేసరికి ఇక భరించలేక 'ఆపవే నువ్వూ నీ నవ్వూ' అంటూ కేకలేసింది యోగిత!

యోగిత, మానస ప్రాణ స్నేహితులు, కె.జి. నుంచి పి.జి. వరకు! (కిండర్ గార్డెన్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ దాకా) "లేకపోతే ఏంటే? ఎక్కడైనా ఆడ బాధ్యతలూ, మొగ బాధ్యతలూ అంటూ వుంటాయా? బాధ్యతలకు కూడా 'జెండర్'ని అంటగడుతున్నావా? నీ దుంపతెగ! ఎంతైనా ఇంగ్లీషు లెక్చరరువి కదా!" మళ్ళీ నవ్వింది మానస.

"మాటలు మార్చబోకు! ఎంతైనా తెలుగు లెక్చరరువికదా? మొగవాళ్ళ బాధ్యతా, ఆడవాళ్ళ బాధ్యతా వేరుగా వుంటుందన్నానుగానీ, మొగబాధ్యతా ఆడ బాధ్యతా అనలేదు." కోపం వొచ్చిన దానిలా కనుబొమలు చిట్లించింది యోగిత!

"అదేలేవోయ్! బాధ్యత అనేది అందరికీ ఒకటేకదా! అందులో ఈ విభజన ఏమిటీ అంటున్నాను" నవ్వుతూనే అడిగింది మానస.

"చూడు చిట్టితల్లీ!" బాధ్యత అన్న పదానికి అర్థం ఒకటే కాదనను. అది స్త్రీ పురుషులిద్దరికీ ఒకటే రకమైతే ఫరవాలేదు. ఆ కర్తవ్య నిర్వహణ కూడా ఒక్కటే అవుతుంది. అంటే ఉద్యోగంలో బాధ్యత! అది ఆడైనా, మొగైనా ఒకేలా వుంటుంది. అదే మరొకటైతే అది వేరేలా వుంటుంది.

"మరొకటి అంటే?"

"స్వతహాగా స్త్రీలకీ పురుషులకీ వేర్వేరు బాధ్యతలుండవంటావా? సంపాదించి కుటుంబాన్ని పోషించడం ముఖ్యంగా పురుషుడి బాధ్యత. మొగవాడు సంపాదించలేని పరిస్థితిలో వుంటేనో, మొగవాడి సంపాదన కుటుంబ పోషణకి సరిపోకపోతేనే సాధారణంగా ఆడవాళ్ళు కూడా సంపాదిస్తున్నారు. అంతేకాదు ఈ రోజుల్లో ఆడవాళ్ళు పెద్ద పెద్ద చదువులు చదువుకుంటున్నారు కనుక వాళ్ళు కూడా సంపాదిస్తే బాగుంటుందనీ, వాళ్ళకంటూ ఒక వ్యక్తిత్వం ఏర్పడుతుందనీ కూడా సంపాదిస్తున్నారు. దానివల్ల వాళ్ళ కుటుంబాలని హాయిగా నడుపుకుంటున్నారు. అది వేరే విషయం.

కానీ ఆ కుటుంబంలో భర్త తాలూకు తల్లిదండ్రులని చూడవలసిన బాధ్యతగానీ, అన్నదమ్ములెవరైనా వుంటే వాళ్ళని అవసరమైతే చదివించవలసిన బాధ్యతకానీ, పెళ్ళి కావలసిన చెల్లెళ్ళకి పెళ్ళీ పేరంటాలూ చెయ్యవలసిన బాధ్యతగానీ, ఆ ఇంటి మొగాడిమీద వుంటుందికానీ సంపాదిస్తున్నా సరే వొదినగారి మీద వుండదు. 'వొదిన చెడ్డది' అంటారు లేదా మా అన్నయ్యని మాకు కాకుండా చేస్తోంది అంటారు. అంతేకాని ఆమె సంపాదన మాకు పెట్టడం లేదు అనరు."

"అలాగే మొగపిల్లలు లేనిచోట అవసరమైతే ఆడపిల్లలు ఆదుకున్న కుటుంబాలూ వున్నాయి. అయితే అవి ఎంతవరకు? స్త్రీ అవివాహితగా ఉన్నంతకాలమే! వివాహం చేసుకున్నాక, ఆమెకి ఆ హక్కు పోతుంది! బాధ్యత తన భర్తపైన, అతని కుటుంబంపైనా వుంటుంది! అంతేకదా!" అడిగింది యోగిత.

"అవునూ!" అంది మానస.

"అటువంటప్పుడు మగాడు సంపాదించే పరిస్థితిలో లేకపోయినా లేదా సంపాదన తనమీద ఆధారపడ్డ వాళ్ళని చూడ్డానికి చాలకపోయినా అందరూ అతణ్ణి పనికిరాని వాడంటారు. లేదా చవటకింద చూస్తారు. అందుకనే మొగవాడికి, చిన్నతనంనుంచీ దృష్టి తను ఏం చేస్తే ఎక్కువ సంపాదించగలడు? అన్న

ధ్యాసలోనే వుంటుంది. తను హెూదాలో వున్నాడనీ, మంచి సంపాదనా పరుణ్ణనీ చెప్పుకుంటేనే గౌరవాన్ని పొందగలుగుతాడు (చెప్పుకోవడం కాదు, చేసి చూపిస్తేనే!) లేకపోతే న్యూనతా భావంతో కుమిలిపోతాడు. ముఖ్యంగా మగాడి కష్టాల్లో ఇదొకటి అని ఖచ్చితంగా చెప్పొచ్చు.

ఆడవాళ్ళు వాళ్ళ బాధ్యతని తనూ తన భర్తా పిల్లలవరకే పరిమితం చేసుకుంటారు సాధారణంగా! కానీ మొగవాళ్ళకి అలాకాదు కదా! అతని బాధ్యత అతనికన్న వారినీ, తోబుట్టువులనూ చూడడానికి కూడా కావాలి! అందుకు అనుకూలవతి అయిన భార్య దొరికితే సరే! లేకపోతే? అతని జీవితం ప్రత్యక్ష నరకం!" చెప్పడం ఆపింది యోగిత.

"అవును! నువ్వన్నది కరక్టే!" అని ఒప్పుకుంది నవ్వాపి సీరియస్‌గా ఆలోచిస్తుంది మానస.

"అందుకే నేనాలోచించి, ఆడపిల్లనే కన్నాను. దానికి ఇటువంటి బాధ్యతల బాధలేదుగా!" అంది యోగిత.

"ఆ... అక్కడే పప్పులో కాలేశావ్! బాధ్యత స్వరూపం వేరుగానీ, బాధ్యతలు లేని మనిషుంటాడా? వీళ్ళ బాధ్యతలు వీళ్ళకీ వున్నాయి" అంది మానస.

"అంతేలే! జీవితం అంటేనే బాధ్యత!" అంది యోగిత.

"ఇవాళ మనమంతా ఫిలాసఫీ మాట్లాడుకున్నాం. కాస్త టాపిక్ మార్చు! కాఫీ ఇవ్వు" అంది మానస తల బరువెక్కినట్టు కణతలు నొక్కుకుంటూ.

*